RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 260 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | ఆదివారం, 24 మార్చి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# కాంగ్రెస్‌లో విలీనమేనా!?

## 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రెడీ!?






## కేసీఆర్ పార్టీని చావుదెబ్బకొట్టేలా రేవంత్ భారీ స్కెచ్..?

హైదరాబాద్ : రాజకీయాల్లో హిస్టరీని రిపీట్ చేయాలని కాంగ్రెస్ భావిస్తున్నది. అందుకు అనుగుణంగా వ్యూహాలు రచిస్తున్నది. గతంలో సీఎల్పీని విలీనం చేసుకుని కాంగ్రెస్‌ను వీక్ చేసిన కేసీఆర్‌ను.. అదే ఫార్ములా ఉపయోగించి దెబ్బకొట్టేందుకు రెడీ అవుతున్నది. ప్రస్తుతం రాష్ట్రంలో హస్తం పార్టీ అధికారంలో ఉండటంతో గులాబీ పార్టీకి చెందిన చాలా మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు సంబంధించి చర్చలు సైతం కొనసాగిస్తున్నారు. మొత్తంగా బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకుని రాజకీయంగా గులాబీ బాస్‌ను పూర్తిగా బలహీన పర్చేందుకు అధికార పార్టీ అడుగులు వేస్తున్నది. అందుకు ఏఐసీసీ నుంచి సైతం గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్టు సమాచారం. దీంతో పార్టీ మారేందుకు సానుకూలంగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంతనాలు జరుపుతున్నట్టు తెలుస్తున్నది.

**టార్గెట్ ఎల్పీ..** బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఒక్కొక్కరిని పార్టీలో చేర్చుకోవడం కన్నా బీఆర్ఎస్ఎల్పీని సీఎల్పీలో విలీనం చేయాలని కాంగ్రెస్ అధిష్టానం.. రాష్ట్ర నేతలకు క్లారిటీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఒక్కొక్క ఎమ్మెల్యేను పార్టీలో చేర్చుకోవడం వల్ల రాజకీయంగా విమర్శలు వస్తాయని వారించిన హైకమాండ్.. విలీనంపై ఫోకస్ పెట్టాలని సూచించినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీకి 38 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో 2/3 వంతు మంది ఎమ్మెల్యేలు (26 మంది) పార్టీ మారితే ఫిరాయింపుల చట్టం వర్తించదు. పార్టీ మారేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వారంతా స్పీకర్‌కు లేఖ ఇస్తే, ఆ గ్రూపును అసలైన బీఆర్ఎస్ఎల్పీగా గుర్తించి కాంగ్రెస్‌లో విలీనం చేసే అధికారం సభాపతికి ఉంటుంది. ఎల్పీ విలీనానికి అవసరమైన 26 కన్నా ఎక్కువ మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు రెడీగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

**కేసీఆర్‌ను దెబ్బకొట్టేలా..** 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్.. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను తన వైపు తిప్పుకున్నది. 2014 ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత టీడీపీకి చెందిన 12 మందిని, కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురిని, వైసీపీకి చెందిన ముగ్గురిని, బీఎస్పీకి చెందిన ఇద్దరిని, సీపీఐ తరఫున గెలిచిన ఒక ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన 19 మంది ఎమ్మెల్యేల్లో 12 మందిని కేసీఆర్ తన పార్టీలో చేర్చుకున్నారు.

వారితో పాటు టీడీపీ నుంచి ఇద్దరిని, మరో ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలను జాయిన్ చేసుకున్నారు. 19 మంది ఎమ్మెల్యేల్లో 12 మందిని బీఆర్ఎస్‌లో చేరగానే కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా పోయింది. ఇప్పుడు బీఆర్ఎస్‌ను సైతం అదే తీరుగా దెబ్బకొట్టాలని కాంగ్రెస్ వ్యూహ రచన చేస్తున్నది.

**లోక్‌సభ పోలింగ్ లోపు కంప్లీట్..!** : రాష్ట్రంలో మే 13న లోకసభ ఎన్నికల పోలింగ్ జరుగనున్నది. అంతలోపై బీఆర్ఎస్ఎల్పీ విలీనం ప్రక్రియ పూర్తి చేయాలని కాంగ్రెస్ భావిస్తున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల టైమ్‌లో గులాబీ పార్టీకి క్షేత్ర స్థాయిలో పనిచేసేందుకు లీడర్లు లేకుండా చేయడమే హస్తం పార్టీ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పి, కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో గులాబీ పార్టీకి 15 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో మెజార్టీ శాసనసభ్యులు హస్తం గూటికి చేరేందుకు క్యూ కడుతున్నట్టు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

**30 మంది ఎమ్మెల్యేలు రెడీ..!...** కాంగ్రెస్‌లో చేరేందుకు సుమారు 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నట్టు హస్తం పార్టీ లీడర్లు ప్రచారం చేస్తున్నారు. పార్టీలో చేరబోయే ఎమ్మెల్యేలతో సీఎం, డిప్యూటీ సీఎం మంతనాలు జరుపుతున్నట్టు టాక్.

ముందుగా గ్రేటర్ హైదరాబాద్ ఎమ్మెల్యేలను చేర్చుకుని, ఆ తర్వాత మెదక్, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలను చేర్చుకోవాలని ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. దశలవారీగా ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్న తర్వాత లోక్‌సభ ఎన్నికల లోపు ఎల్పీ విలీనం పూర్తి చేయాలని హస్తం పార్టీ టార్గెట్ పెట్టుకున్నట్టు టాక్.

# బిగ్‌బాస్‌కు స్వాగతం

## కేజ్రీవాల్‌కు సుఖేశ్ దిమ్మతిరిగే లేఖ




ఆర్థిక నేరారోపణల కింద తీహార్ జైలులో ఉన్న సుఖేశ్ చంద్రశేఖర్ ఎప్పటికప్పుడు లేఖలు విడుదల చేస్తూ.. పలు సంచలనాలకు కేరాఫ్‌గా మారాడు.. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవిత, ఆప్ నేతలు కేజ్రీవాల్, సత్యేంద్రజైన్, సిసోడియాపై సంచలన ఆరోపణలు చేస్తూ సుఖేష్ ఇప్పటికే పలు లేఖలు విడుదల చేశాడు. తాజాగా కవిత అరెస్ట్‌కు తీహార్ జైలు స్వాగతం పలుకుతుందంటూ లేఖ రాసిన సుఖేష్.. అరవింద్ కేజ్రీవాల్‌ను వదిలిపెట్టలేదు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కేజ్రీవాల్‌ను ఈనెల 21న ఈడీ అరెస్ట్ చేయగా.. నిన్న ఆయనను 6 రోజుల ఈడీ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో 'తీహార్ క్లబ్'లోకి స్వాగతం అంటూ సుఖేష్ మరో లేఖ విడుదల చేశారు. కేజ్రీవాల్ మోసగాడు.. సత్యం ఎప్పటికీ గెలుస్తుంది.. చట్టానికి ఎవరూ అతీతులు కాదని చెప్పడానికి ఇదే ఉదాహరణ అంటూ సుఖేష్ లేఖలో పేర్కొన్నారు. తీహార్ క్లబ్ బిగ్ బాస్‌గా మిమల్ని స్వాగతిస్తున్నానంటూ లేఖలో పేర్కొన్నారు. మీ డ్రామాలు చివరి దశకు చేరుకున్నాయి. ఇక ఎంత నటించినా తప్పించుకోలేరని సుఖేష్ లేఖలో రాశాడు. మార్చి 25వ తేదీన తన పుట్టినరోజని, మూడు రోజుల ముందే బర్త్‌డే సెలబ్రేషన్స్ జరుపుకుంటున్నట్లు తెలిపాడు. మీ అరెస్ట్‌ను నా పుట్టిన రోజు బహుమతిగా భావిస్తున్నట్లు సుఖేష్ చంద్రశేఖర్ పేర్కొన్నాడు.


**ముగ్గురు సోదరులు..** తీహార్ జైలును నడపడానికి తన ముగ్గురు సోదరులు ఇక్కడకు వచ్చారని.. ఒకరు ఛైర్మన్ బిగ్‌బాస్ అరవింద్ కేజ్రీవాల్ అయితే సీఈవో మనీష్ సిసోడియా, సీఓఓ సత్యేందర్ జైన్ అంటూ సుఖేష్ తన లేఖలో పేర్కొన్నాడు. బ్రదర్ కేజ్రీవాల్ మీ అవినీతి అంతా బయట పడబోతుంది..

మీరు సీఎం హోదాలో చేసిన స్కామ్‌లతో పేద ప్రజలను దోచుకున్నారని సుఖేష్ ఆరోపించాడు. మీ మోసాలను పూర్తిగా బహిర్గతం చేస్తానాంటూ హెచ్చరించాడు.




## ఎమ్మెల్సీ కవితకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కోర్టు!

దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కాసింత రిలీఫ్ దక్కింది. ఓ వైపు వరుస ఈడీ సోదాలు.. మరోవైపు కస్టడీలో విచారణతో సతమతం అవుతున్న కవిత కుటుంబ సభ్యులతో మాట్లాడటానికి అనుమతివ్వాలని రౌస్ అవెన్యూ కోర్టును కోరింది. అది కూడా పది నిమిషాలు మాత్రమే సమయం అడిగారు కవిత. ఇందుకు స్పందించిన కోర్టు ఓకే అని చెప్పింది. ఇవాళ కస్టడీ ముగిసిన తర్వాత కవితను ఈడీ అధికారులు.. కోర్టులో హాజరుపరిచారు. మరో ఐదురోజులు కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరగా.. మూడ్రోజులకు మాత్రమే అనుమతిచ్చింది. ఈ క్రమంలో కవిత 10 నిమిషాలపాటు పిల్లలతో మాట్లాడి అనంతరం ఈడీ కస్టడీకి వెళ్లారు. ఇదివరకే కుటుంబ సభ్యులతో మాట్లాడటానికి.. ఇంటి భోజనం తెప్పించుకోవడానికి కూడా కోర్టు అనుమతిచ్చిన సంగతి తెలిసిందే.



# రైతన్నలకు శుభవార్త!

## యాసంగి ధాన్యం కొనుగోళ్లకు వేళాయె!!

### 1వ తేదీ నుంచి యాసంగి ధాన్యం కొనుగోళ్లు - రాష్ట్రవ్యాప్తంగా 7,149 కొనుగోలు కేంద్రాలు

### 75.20 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం..

హైదరాబాద్ : యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లకు ముహూర్తం ఖరారైంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 7,149 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 75.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)కు ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ మేరకు యాసంగి ధాన్యం సేకరణపై వివిధ జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, ఎఫ్ఐసీ అధికారులు, పౌర సరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, పోలీసు శాఖల అధికారులతో ఆయన హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలో 66 లక్షల ఎకరాల్లో వరి సాగవ్వగా 121 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా అని చౌహాన్ పేర్కొన్నారు. ఇందులో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు 75లక్షల టన్నుల పైచిలుకు ధాన్యం వస్తుందని అంచనా అన్నారు. గతేడాది కంటే ఈసారి కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచినట్లు వెల్లడించారు.

ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబరు 30 వరకు(ఆరు నెలల వ్యవధిలో) మిల్లింగ్ మొత్తం పూర్తి చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) డెలివరీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎంఆర్ బకాయిలు 30 లక్షల మెట్రిక్ టన్నులు ఉండడంపై అధికారులను ప్రశ్నించారు. అప్పులు, వడ్డీ భారం దృష్ట్యా సకాలంలో సీఎంఆర్ డెలివరీలు, బకాయిల రికవరి జరగాలని ఆదేశించారు. ఇక,? రైస్‌మిల్లర్లు, రేషన్ డీలర్లు, ఇతరత్రా ప్రైవేటు వ్యక్తులెవరూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనిపించకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సిబ్బంది మినహా ఇతర వ్యక్తులు ఎవరైనా కొనుగోలు కేంద్రాల్లో కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్‌సీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యం సేకరణ చేయాలని, ఇష్టారాజ్యంగా తరుగు తీసి రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులకు స్పష్టం చేశారు. గతేడాదికి సంబంధించి 35లక్షల టన్నుల ధాన్యాన్ని టెండర్ల ప్రక్రియలో విక్రయించామని, తక్షణమే ధాన్యం లిఫ్టింగ్ చేయించాలని అధికారులను ఆదేశించారు. కాగా, పాత ధాన్యం నిల్వలు ఎక్కడైనా ఉండి, నాణ్యత ఉంటే మిల్లింగ్ చేసిస్తే తీసుకుంటామని తెలిపారు. ధాన్యం, బియ్యంలో నాణ్యత లేకపోతే సీఎంఆర్ తీసుకునేది లేదని, ఇతర రాష్ట్రాల పీడీఎస్ అవసరాలకు పంపిస్తే తెలంగాణ బ్రాండ్ దెబ్బతింటుందన్నారు. నాణ్యత లేని బియ్యాన్ని తెలంగాణ ప్రజల ఆహార అవసరాలకు సరఫరా చేయలేమన్నారు.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# కేజ్రీవాల్ ఎఫెక్ట్

## ఇండియా కూటమిపై ఒత్తిడి!

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే.. ఈ ప్రభావం ఒక్క ఆయన పార్టీ ఆమ్ ఆద్మీపైనే కాకుండా కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీల పైనా పడింది. ఇప్పుడు కేజ్రీవాల్‌ను రక్షించుకోకపోతే.. ఎన్నికల సమయానికి సగానికిపైగా పార్టీల అధినేతలు జైలు బాట పట్టే అవకాశం ఉందని ఇండియా కూటమి నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్‌ను సాధ్యమైనంత వేగంగా బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేయాలనే వ్యూహాలు అమలు చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయనను తక్షణం బయటకు తీసుకురావల్సిన అవసరం ఉంది. ఏం చేయాలనే దానిపై ఇండియా కూటమిలోని పార్టీలన్నీ వెంటనే ఒక సరైన నిర్ణయాన్ని తీసుకోవాలి అని ఆయన అన్నారు. కూటమి బలంగా ఉండాలనే విషయాన్ని తాను ముందు నుంచి చెపుతూనే ఉన్నానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలపై అందరం కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. లిక్కర్ పాలసీ కేసు జీరో కేసు అని... అప్రూవర్లుగా మారిన వారి వాంగ్మూలాల పైనే కేసు ఆధారపడి ఉందని అన్నారు. ఈ కేసులో ఆధారాలు లేవని, జరుగుతున్న తతంగం అంతా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని చెప్పారు. మరోవైపు.. ఆప్ సీనియర్ నాయకురాలు, ఢిల్లీ మంత్రిఅతిషి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇండియా కూటమిని దెబ్బతీసేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను సామూహికంగా ఎదుర్కొనవలసిన అవసరం ఉందని ఆమె చెప్పారు. ఈడీని అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో గెలవాలనుకోవడం సరైనది కాదని, దమ్ముంటే తమతో ఎన్నికల క్షేత్రంలో తలపడాలని మంత్రి అతిషి బీజేపీకి సవాల్ విసిరారు. ఈడీని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం బీజేపీ మానుకోవాలని హితవు పలికారు. బీజేపీ ఈ రోజు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మండిపడ్డారు. పార్టీ బ్యాంకు ఖాతాలను కూడా స్తంభింపజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఈ రకంగా గెలవాలని ప్రయత్నిస్తోందన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

# యాసంగి.. అంతకు మించి



తాండూరు : జిల్లాలో ఈసారి యాసంగి పంటలు సాధారణానికి మించి సాగయ్యాయి. వానా కాలంలో కురిసిన వర్షాలకు జిల్లాలోని 1179 చెరువులు, కుంటలతో పాటు 9 ప్రధాన జలాశయాలు కూడా పూర్తిగా నిండి మత్తడి దుంకాయి. కాగ్నా, కాకరవేణి, మూసి నదులు నిండుగా ప్రవహించాయి. ఈ నేపథ్యంలో 50వేల వరకు ఉన్న బోర్లు, బావులు ఒత్తిడితో నీటిని అందించాయి. ఇది రైతులకు కలిసి వచ్చింది. వానా కాలం పంటల సాగు పూర్తి కాగానే రైతులు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని గతేడాది అక్టోబరు నుంచి నవంబరు వరకు యాసంగి సీజన్‌కు సంబంధించిన పంటలను ఆశాజనకంగా రైతులు సాగు చేశారు.

26.50 శాతం ఎక్కువ

జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో యాసంగి (రబీ) సాధారణ సాగు 99,244 ఎకరాలుగా ఉంది. యాసంగి పంటలు 126.50 శాతంగా సాగయ్యాయి. ఇది సాధారణ సాగు విస్తీర్ణం కంటే 26.50 శాతం ఎక్కువ. నీటి వనరుల కొరత లేకపోవడంతో పంటల సాగు 1,21,056 ఎకరాలకు పెరగ వచ్చని అంచనా వేసింది. వాతావరణం సహకరించడం, నీటి ఎద్దడి లేక పోవడంతో రైతులు అంచనా వేసిన దాని కంటే 4,491 ఎకరాల ఎక్కువతో 1,25,547 ఎకరాల్లో సాగు చేశారు.

సింహ భాగం వరిదే..

యాసంగి అంతా కలిసి లక్ష ఎకరాలుంటే వరి ఒక్కటే దాదాపు 50,000 ఎకరాలు సాగైంది. ఈ పంటనే సింహభాగం ఆవరించింది. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని నల్లరేగడి భూములు అధిక తేమకు లోనయ్యాయి. అక్టోబరు, నవంబరు నెలలో సాగుకు అనుకూలంగా మారాయి. నేలల్లోని తేమ ఆధారంగానే రైతులు జొన్న, బెంగాల్ గ్రామ్ ( శనగలు), కుసుమలు వంటి పంటలు వేశారు. జొన్న దిగుబడులు కూడా ఆశాజనకంగా వచ్చాయి.

ఊరించిన రూ.500 బోనస్

పంట నుంచి వచ్చే దిగుబడుల్లో ప్రతి క్వింటాలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్‌గా చెల్లిస్తామని ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు రైతులు వరి సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచారు. వేరుసెనగ దిగుబడులు ఆశాజనకంగా వచ్చినా విపణుల్లో గిట్టుబాటు ధరలు లభించక విస్మయం వ్యక్తం చేశారు. మక్కజొన్నలను ఆహార పదార్థాల తయారీ, హేచరీస్‌లో దాణా కోసం ఎక్కువగా వినియోగించడంతో డిమాండ్ ఉంది. రైతులు పంటను ఎక్కువ సాగు చేసి ఆర్థిక లబ్ధి పొందారు. విపణిలో కందులకు భారీ ధరలు లభిస్తున్న నేపథ్యంలో రైతులు యాసంగి కంది సాగుకు ప్రాధాన్యం ఇచ్చారు. మిగిలిన మినుములు, పెసలు, రాగి, బాజ్రా, చెరకు వంటి తదితర అన్ని రకాల పంటల సాగు అంచనాను మించిందని జిల్లా వ్యవసాయ శాఖ రికార్డుల్లో నమోదు చేసింది.

# చెరువేకదా.. చెరబెట్టేద్దాం



హైదరాబాద్ : హైదరాబాద్ ఐటీకారిడార్‌లో విప్రో కూడలికి సమీపంలో ఓ చెరువుపై అక్రమార్కుల కన్ను పడింది. విప్రో నుంచి వట్టి నాగులపల్లికి వెళ్లే రహదారికి అడ్డుగా ఈ చెరువుందని గ్రహించారు. చెరువు మధ్యలోంచి రహదారి నిర్మించాలని నిర్ణయించారు. నీళ్లులేక ఎండిపోతుండడంతో పథకం ప్రకారం చెరువును ఒకవైపు నుంచి మట్టితో పూడ్చేశారు. తర్వాత నీళ్లొచ్చినా మట్టి కరిగిపోకుండా చదును చేశారు.. నార్సింగి మున్సిపాలిటీ అధికారులు, సిబ్బందిలో కొందరిని సంప్రదించి సిమెంట్‌రోడ్డు వేయాలంటూ అభ్యర్థించారు. గుట్టుచప్పుడు కాకుండా కొద్దిరోజుల క్రితం చెరువు మధ్యలోంచి ఒక వరుస సిమెంట్ రోడ్డును నిర్మించారు. భవిష్యత్తులో చెరువు మీదుగా ఐటీకారిడార్‌కు అటువైపు సిమెంట్‌రోడ్డును పొడిగిస్తే, బహుళ అంతస్తుల నిర్మాణాలకు, ఫంక్షన్ హాళ్లకు, ప్రైవేటు లే-అవుట్లకు ఇది సర్కారు రహదారిగా మారనుంది.

అధికారుల నిర్లక్ష్యం.. కబ్జాదారులకు వరం..

వట్టినాగులపల్లిలోని ఐటీ సంస్థలు, గేటెట్ కమ్యూనిటీలున్న ప్రాంతం మధ్యలో గౌని చెరువుంది. పదెకరాలకుపైగా విస్తీర్ణమున్న ఈ చెరువు నీళ్లను పంటపొలాలకు వినియోగిస్తుండగా... పదీ, పదిహేనేళ్ల క్రితం రియల్ వెంచర్లు, ఐటీ పరిశ్రమలు రావడంతో అక్కడున్న వారు భూములు అమ్మేసుకున్నారు. నివాస ప్రాంతాలు, ఐటీసంస్థల కార్యకలాపాలతో చెరువు క్రమంగా ఎండిపోసాగింది. వట్టినాగులపల్లి, గోపన్‌పల్లి, గౌలిదొడ్డి ప్రాంతాల్లోని కొన్నిచెరువుల సమీపంలో రియల్ వెంచర్లు వేసిన వారిలో కొందరు చెరువుల బఫర్‌జోన్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. గౌనిచెరువు బఫర్‌జోన్‌లోనూ ఒక ఫంక్షన్‌హాల్ నిర్మించారు. ఇందులో కొంత ఎఫ్‌టీఎల్ కూడా ఉందని స్థానికులు చెప్పినా.. ఇరిగేషన్‌శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మూడు నెలల నుంచి గౌనిచెరువును మట్టితో పూడ్చి చదును చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదు.

సహకరించిన యంత్రాంగం

గౌని చెరువుకు సమీపంలోని ప్రైవేటు భూములు ప్రస్తుతం ఎకరా రూ.70కోట్ల నుంచి రూ.80కోట్ల వరకూ పలుకుతున్నాయి. కొన్ని బడా సంస్థలు గౌని చెరువు పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలు మొదలు పెట్టాయి. వీటికి రోడ్డు కోసం గౌని చెరువు మధ్యలో సిమెంట్ రోడ్డు వేయించేందుకు అక్రమార్కులు నార్సింగి మున్సిపల్ సిబ్బందిని సంప్రదించారు. కిందిస్థాయి సిబ్బంది ఒక అధికారికి ఈ విషయం చెప్పగా గుట్టుచప్పుడు కాకుండా ప్రతిపాదనలు రూపొందించి సీసీ రోడ్డును మంజూరు చేయించారు. కొద్దిరోజుల క్రితం సీసీ రోడ్డు వేయించారు. ఈ రోడ్డు వేసినట్లు ఉన్నతాధికారులకు, ఇరిగేషన్ అధికారులకు తెలీదు. ఇరిగేషన్, మున్సిపాలిటీ అధికారులను సంప్రదించగా పరిశీలించి చర్యలు చేపడతామని వివరించారు.

# రెండు మహోదారులు.. రూ.3,800 కోట్లు

హైదరాబాద్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్, రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్ పనులకు వీలైనంత వేగంగా శ్రీకారం చుట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. నిధుల సమీకరణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. పలు సంస్థలతో సంప్రదింపులు చేస్తున్నట్లు తెలుస్తోంది. రోజుల వ్యవధిలోనే స్పష్టత వచ్చే సూచనలున్నాయి. ఎన్‌హెచ్-44పై రూ.1580 కోట్ల వ్యయంతో 5.32 కి.మీ.మేర డబుల్ డెక్కర్ కారిడార్, దానిపై మెట్రోమార్గం నిర్మించనున్నారు. సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ జంక్షన్‌నుంచి ఈ రహదారి మొదలై తాడ్‌బండ్ జంక్షన్, బోయిన్‌పల్లి జంక్షన్ మీదుగా డెయిరీ ఫాం రోడ్డువద్ద ముగుస్తుంది. ఇది పూర్తయ్యాక ఈ ఎలివేటెడ్ కారిడార్‌పై మెట్రో మార్గం నిర్మించనున్నారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ జంక్షన్ వరకు రూ.18.10 కి.మీ.మేర ఈ ఎలివేటెడ్ కారిడార్ రానుంది. ఇటీవలే రక్షణ శాఖ భూములు అప్పగించింది. రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్‌కు 113, డబుల్ డెక్కర్ రహదారికి 55.85 ఎకరాలు హెచ్ఎండీఏకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఖాతా ఖాళీ.. ఎలా ముందుకెళ్లాలి?

డబుల్ డెక్కర్ రహదారికి రూ.1580 కోట్లు, రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.2,232 కోట్లు అవసరం. మొత్తంగా హెచ్ఎండీఏ



రూ.3,812 కోట్లు సమకూర్చుకోవాలి. గతంలో భూముల అమ్మకంతో రూ.3500 కోట్లు, అవుటర్ రింగ్‌రోడ్డు లీజుతో మరో రూ.7300 కోట్లు హెచ్ఎండీఏ ఖాతాలో జమయ్యాయి. ఈ నిధులన్నీ గతంలో ఇతర ప్రభుత్వ అవసరాలకు వినియోగించడంతో ఖాతా ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో ఈ రెండు రహదారుల నిర్మాణానికి నిధుల సమస్య లేకుండా హడ్కో లాంటి ఇతర సంస్థలను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో స్పష్టత రానుండటంతో టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులు ప్రారంభించాలని అధికార యంత్రాంగం యోచిస్తోంది.

# తవ్వేస్తున్నారు.. అమ్మేస్తున్నారు..!

కొత్తగూడెం : భద్రాద్రి జిల్లా పరిధిలోని ఇసుక రీచ్‌ల్లో కార్యకలాపాలు కొనసాగకుండా కాంగ్రెస్ సర్కారు అడ్డుకట్ట వేసింది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన విధానంలో లోపాలున్నాయని, కొత్త పాలసీ ప్రవేశపెట్టబోతున్నట్లు ప్రకటించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక రీచ్‌ల్లో నిల్వలను టీఎస్ఎండీసీ ద్వారా విక్రయించుకోవటానికి అనుమతులిచ్చింది. దీన్ని ఆసరాగా చేసుకుని రీచ్‌ల నిర్వాహకులు అక్రమ దందాకు తెరలేపుతున్నారు.

గతంలో రూ.1,500.. ప్రస్తుతం రూ.2,500

గత ప్రభుత్వ హయాంలో రీచ్‌ల్లో ఒక్కో లారీ లోడ్ కోసం రూ.1,500 వసూలు చేసేవారు. ప్రస్తుతం రూ.2,500 అడుగుతున్నారని డ్రైవర్లు చెబుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే అదనపు బకెట్ల వ్యవహారాన్ని ప్రస్తుత ప్రభుత్వం అడ్డుకుంటుందని, అందుకే భారం మోపుతున్నట్లు నిర్వాహకులు బదులిస్తున్నారని వాపోతున్నారు. టీఎస్ఎండీసీ అధికారుల నిర్లక్ష్యంతో లోడ్ సమస్య ఉత్పన్నమవుతోందని ఆందోళన చెందుతున్నారు. ఒక్కో లారీ లోడ్ కావటానికి మూడు నుంచి ఐదు రోజుల సమయం పడుతుందని చెబుతున్నారు.

అర్ధరాత్రి యంత్రాల సాయంతో..

గోదావరి నది నుంచి ఇసుక తీసుకోవటానికి గిరిజన సొసైటీలకు ప్రభుత్వం అనుమతులిస్తుంది. నదిలోంచి గిరిజన చట్టాలకు అనుగుణంగా తవ్వకాలు జరపాలి. సాధారణంగా నదిలో భారీ యంత్రాల సాయంతో ఇసుక తవ్వకాలు జరపటం నిషేధం. స్థానిక గిరిజనులతోనే తవ్వించాలి. అధికారుల కళ్లుగప్పి అర్ధరాత్రుల్లో యంత్రాల సహాయంతో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా చర్ల మండలంలోని ఇసుక రీచ్‌ల్లో ఈదందా జోరుగా సాగుతున్నట్లు పేర్కొంటున్నారు. తమ ఉపాధికి గండిపడుతోందని ఆవేదన చెందుతున్నారు. ఈఅంశంపై టీఎస్ఎండీసీ అధికారులను చరవాణిలో 'ఈనాడు' సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

సరిహద్దు సమస్యతో నిలిచిన రవాణా

ఆంధ్ర-తెలంగాణ అంతర్రాష్ట్ర సరిహద్దు సమస్యతో దుమ్ముగూడెం మండలం తూరబాక క్వారీ నుంచి నాలుగు రోజులుగా ఇసుక రవాణా నిలిచిపోయింది. ప్రజాప్రతినిధుల జోక్యం వల్లే ఈపరిస్థితి ఉత్పన్నమైనట్లు సమాచారం. కొద్దిరోజుల క్రితం ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొన్ని లారీలను తెలంగాణ పోలీసులు సీజ్ చేశారు. ఆగ్రహించిన ఏపీకి చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యే.. ఎటపాక పోలీసులపై ఒత్తిడి తెచ్చి తెలంగాణకు చెందిన ఇసుక లారీలను నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈసమస్యను పరిష్కరించాల్సిన టీఎస్ఎండీసీ అధికారులు పట్టించుకోవటం లేదని లారీ డ్రైవర్లు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. నిర్వాహకులకు వరం

కేవలం రీచ్‌లో నిల్వ ఉన్న ఇసుకను మాత్రమే టీఎస్ఎండీసీ ద్వారా విక్రయించాలి. కొత్తగా గోదావరి నదిలో ఇసుక తవ్వకాలు నిషేధం. అయితే కొన్ని రీచ్‌ల నిర్వాహకులు నిల్వలను విక్రయిస్తున్నట్లు చూపుతూ రాత్రుల్లో యంత్రాల సహాయంతో తవ్వకాలు జరుపుతూ గోదావరి నదికి తూట్లు పొడుస్తున్నారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించటం అనుమానాలకు తావిస్తోంది.

దుమ్ముగూడెంలోని తూరబాక, చర్లలోని బేతంపల్లి, మణుగూరు రీచ్‌ల్లో నిల్వ ఉన్న ఇసుకను విక్రయించేందుకు అనుమతులున్నాయి. చర్ల మండలం పెద్దపల్లిలో నది నుంచి ఇసుక తీసుకునేందుకు అనుమతులిచ్చాం. రాత్రుల్లో యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారనే విషయం మాదృష్టికి రాలేదు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.
దినేష్‌కుమార్, మైనింగ్ ఏడీ, భద్రాద్రి కొత్తగూడెం

# లీకేజీల పురంపర

కొత్తగూడెం : వేసవి కాలం వచ్చేసింది. అక్కడక్కడ నీటి ఎద్దడి నెలకొంటోంది. ఈ సమయంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలను చైతన్యపరచాల్సిన అధికార యంత్రాంగం.. పైపులైన్ల లీకేజీతో జలం వృథా అవుతున్నా పర్యవేక్షించటం లేదు. వాటికి మరమ్మతులు చేపట్టడం లేదు. ఈసారి కరవు పరిస్థితులు ఎదురైనా అధికారుల పనితీరులో మార్పు రావటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిశీలించి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

మధిర పురపాలికలో వివిధ చోట్ల మంచినీటి పైపులైన్లు తరచూ లీకవుతున్నాయి. ఆయా వార్డులకు సరిపడా నీరు అందటం లేదు. అంబేడ్కర్ సెంటర్ ప్రధాన వీధిలో రెండేళ్లుగా పైపులైన్ లీకై తాగునీరు వృథా అవుతున్నా మరమ్మతులు చేపట్టడం లేదు. సిద్ధారెడ్డి బజారుకు వెళ్లే మలుపు వద్ద పైపులైన్ లీకవుతోంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో పైపులైన్ పాడైంది.

బాధ్యతగా వ్యవహరిస్తే కదా..

ఖమ్మం నగరంలో ఇటీవల వారం పాటు మంచినీటి సరఫరా నిలిచిపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. మున్నేరు పూర్తిగా ఎండిపోవటం, సాగర్ జలాల విడుదలలో జాప్యమవటంతో నగర వాసులు పడ్డ అవస్థలు అన్నీఇన్నీకావు. ఇదే సమయంలో వివిధ ప్రాంతాల్లోని లీకేజీల ద్వారా రోజుకు పది మిలియన్ లీటర్ల నీరు వృథాగా పోతుండటం గమనార్హం. వీటిని నియంత్రించేందుకు ప్రజారోగ్య ఇంజినీరింగ్, సాధారణ ఇంజినీరింగ్ విభాగంలో అవసరమైన సిబ్బంది లేకపోవటం సమస్యగా మారింది. కొన్నిచోట్ల ఖాళీ స్థలాల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు ఇవ్వటంతో నీరు వృథా అవుతోంది.

మంచినీరు.. మట్టిపాలు

వైరా పురపాలిక పరిధిలోని సంతబజారులో తాగునీటి పైపులైన్ పగిలి ఆరు నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడం లేదు. సరఫరా సమయంలో మూడు, నాలుగు గంటల పాటు ఏకధాటిగా నీరు వృథా అవుతోంది. వైరా జలాశయం గుట్టల వద్ద మిషన్ భగీరథ పథకం పైపులైన్ల మార్గంలో కొన్ని ఎయిర్‌వాల్వ్‌ల నుంచి తాగునీరు 24 గంటల పాటు అధిక మొత్తంలో మట్టిపాలవుతోంది.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం

సత్తుపల్లి పురపాలికలోని గుడిపాడు రోడ్డులో ప్రాథమిక పాఠశాల సమీపంలో మిషన్ భగీరథ పైపు నుంచి తాగునీరు వృథాగా పోతోంది. కొన్ని రోజులుగా ఈసమస్య వేధిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు చెబుతున్నారు.

పాల్వంచలో 25 శాతం వృథా!

పాల్వంచ పురపాలికలోని 23 వార్డుల్లో తాగునీటి లీకేజీలు లేని కాలనీ లేదంటే అతిశయోక్తి కాదు. లక్షకు పైగా జనాభా నివసిస్తోంది. రోజువారీగా తలసరి నీటి అవసరం 135 మిలియన్ల లీటర్లు. పైపులైన్ పగిలి 25 శాతం నీరు వృథా అవుతుందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కొన్ని ఏరియాల్లో ఏళ్లతరబడి లీకేజీలను అధికారులు పట్టించుకోకపోవటంతో స్థానికులు సొంత నిధులతో మరమ్మతులకు పూనుకోవటం గమనార్హం.

కొత్తగూడెంలో పాత తీరే..

కొత్తగూడెం పురపాలికలోని 36 వార్డులకు రోజూ 9.50 మిలియన్ లీటర్ల నీరు సరఫరా జరగాలి. అయితే రోజు విడిచి రోజు 6.50 మిలియన్ లీటర్ల నీటిని మాత్రమే అందిస్తున్నారు. అందులోనూ 15 శాతం వరకు వృథా అవుతోంది. ప్రధాన పైపులైన్‌కు రేగళ్ల నుంచి కొత్తగూడెంలోని ఇల్లెందు అడ్డరోడ్డు వరకు 15 భారీ లీకేజీలున్నాయి. అంతర్గతంగా వీధుల్లో దాదాపు 30 వరకు పైపులైన్ లీకేజీలు ఏర్పడ్డాయి.

# యువనేత వంశీ పోటీతో రసవత్తరంగా పెద్దపల్లి రాజకీయం



**బెల్లంపల్లి, మార్చి 23( ప్రభాత సమాచారం)**
పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం రాజకీయంగా స్వర్గీయ మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామికి (కకా)పేరు ప్రఖ్యాతులు సంపాదించిందనే చెప్పవచ్చు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుండి రెండు పర్యాయాలు తెలుగుదేశం నుంచి డాక్టర్ సుగుణకుమారి, టిఆర్ఎస్ నుంచి బాల్క సుమన్, వెంకటేష్ నేత ఒక్కోసారి పెద్దపల్లి నుంచి పార్లమెంటుకు సభ్యులుగా ఎన్నికయ్యారు. 1967 నుంచి 2004 వరకు ఏడుసార్లు అదే పెద్దపల్లి నుంచి గడ్డం వెంకటస్వామి ఎన్నికయ్యారు. ఆయన వారసుడిగా డాక్టర్ వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్, బీజేపీ పార్టీలో చేరినా, చివరకు కాంగ్రెస్ లో చేరక తప్పలేదు. వివేక్ పార్టీ మారినా నియోజకవర్గం మాత్రం మారకుండానే రాజకీయ క్షేత్రంలో ఉండడం గమనార్హం. తాజాగా కాకా వెంకటస్వామి మనవడు గడ్డం వంశీకృష్ణ రాజకీయ అరంగేట్రం చేశాడు. తాత,తండ్రి నడిచిన బాటలోనే నడుస్తూ పెద్దపల్లితోనే తన రాజకీయ భవిష్యత్తును తీర్చిదిద్దుకోనున్నాడు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పెద్దపల్లి నుంచి బరిలో వంశీ నిలిచాడు. ఇటీవల బీజేపీలో చేరిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోమాస శ్రీనివాస్ తోపాటు బిఆర్ఎస్ అభ్యర్థి మాజీ రాష్ట్ర మంత్రి,సీనియర్ నాయకుడైన కొప్పుల ఈశ్వర్ ను ఢీకొట్టనున్నాడు గడ్డం వంశీ. కేవలం వారసత్వంగా వచ్చిన రాజకీయం తోనే వంశీకృష్ణ పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలవబోతున్నాడు. చెన్నూర్ ఎమ్మెల్యే తండ్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి ప్రభావంతో గెలిపించుకునే అవకాశాలే ఎక్కువ ఉన్నాయని రాజకీయ శ్రేణుల్లో అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. కాకా వెంకటస్వామి మాత్రం రాజకీయంగా ఎవరి అండ లేకుండానే ఒక్కో మెట్టు ఎక్కుతూ స్వశక్తితో ఢిల్లీ వరకు పదవులను కైవసం చేసుకొని మాస్ లీడర్ గా ఎదగడం జరిగింది. స్వశక్తితో తనకు ఉన్న పరిజ్ఞానంతో కేంద్రమంత్రి పదవులను సైతం పొందాడు. రాజకీయంగా ఎలాంటి అపవాదులు రాకుండా ముందుకు సాగడం గడ్డం వెంకటస్వామి నైజంగా మారింది. స్వర్గీయ వెంకటస్వామి మాత్రం పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి తన 38వ ఏట పార్లమెంటు లో అడుగుపెట్టడం విశేషం. కానీ అయన రికార్డును మాత్రం ఆయన వారసులుగా పెద్దపల్లికి వచ్చినప్పటికీ రికార్డు మాత్రం కొట్టలేకపోయారు. వెంకటస్వామి 38 ఏళ్లకు పార్లమెంటులో అడుగుపెడితే,ఆయన వారసుడిగా వచ్చిన డాక్టర్ వివేక్ వెంకటస్వామి 52 ఏళ్లకు పెద్దపల్లి నుంచి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. తాజాగా వెంకటస్వామి మనవడు,వివేక్ వెంకటస్వామి కుమారుడు గడ్డం వంశీ 40 ఏళ్లకు రాజకీయ ప్రవేశం చేయడం విశేషం. ప్రస్తుతం ఆయన వి6 ఛానల్ కు మేనేజింగ్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు.

# టెన్త్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

### పకడ్బందిగా నిర్వహించాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**గుడిహత్నూర్ మార్చి 23 (ప్రభాత సమాచారం)**
పదవ తరగతి పరీక్షలను పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అలాగే మండల కేంద్రంలోనీ ఉర్దూ స్కూల్ పోలింగ్ కేంద్రంతో పాటు గోండ్ హర్కపూర్ లోనీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో సరైన సౌకర్యాలు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని తాసిల్దార్ కవిత రెడ్డిను సూచించారు. అదేవిధంగా గోండ్ హర్కపూర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసి పౌష్టికాహారం కేంద్రంలో వారు పెడుతున్న ఆహారాన్ని అడిగి తెలుసుకున్నారు. పిల్లల మానసిక అంశాలను గమనిస్తూ ఉండాలని కలెక్టర్ అన్నారు. కేంద్రంలో ఉన్న పిల్లలను అక్షరాలు, రైమ్స్ వారితో చెప్పించారు. చిన్నారి బరువు తగ్గుదల గల కారణాలను విశ్లేషించి తదనుగుణంగా పోషకాహారాన్ని అందించాలని కలెక్టర్ పేరుకున్నారు. అంగన్వాడి కేంద్రంలో ఉంటున్న పిల్లల బరువు ఎదుగుదల తక్కువగా ఉన్న చిన్నారుల పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రిజిస్టర్లను హాజరు పట్టికను కలెక్టర్ పరిష్కరించారు. అంగన్వాడి కేంద్రంలో గర్భిని స్త్రీలకు అందిస్తున్న భోజన సదుపాయాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రన్ని కలెక్టర్ సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకందుతున్న సేవలను, రికార్డులను పరిశీలించి రోజు ఎంత మందికి ఓపీ చూస్తున్నారని, ఇన్ పేషెంట్ల సంఖ్య, పేషెంట్లకు అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు.

**పాఠశాల సిబ్బందిపై కలెక్టర్ కి ఫిర్యాదు**
ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించడానికి వచ్చిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా కు గ్రామస్తులు పాఠశాల సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయులు పాఠశాలకు సమయానికి హాజరు లేదని పిల్లలకు సరైన పాటలు బోధించడం లేదని గ్రామస్తులు కలెక్టర్ ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బందిపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని కల్పము అన్నారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ కవిత రెడ్డి, ఎంపీడీవో హైమద్ హై, డిటి. భాగ్యలక్ష్మి, ఎంపిఓ. సుధీర్ రెడ్డి, పంచాయితీ సెక్రెటరీ ఆగస్టిన్ తదితరులు ఉన్నారు.

# కౌలు రైతు ఆత్మహత్య

### - దిగుబడి రాక, అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి బలవన్మరణం



**గుడిహత్నూర్ మార్చి 23 (ప్రభాత సమాచారం)**
అప్పుల బాధ తలలేక ఓ కౌలు రైతు పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన జాదవ్ రాజారాం ( 56 ) 16 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గత ఖరీఫ్ సీజన్లో పత్తి పండించాడు, రబీలో కూరగాయలు సాగు చేస్తున్నాడు. వాతావరణం అనుకూలించక పంట దిగుబడి సరిగా రాకపోవడంతో మన స్థాపానికి గురయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఈ క్రమంలో శనివారం ఉదయం చేనుకు వెళ్లిన ఆయన కొట్టం వద్ద పడి ఉండడంతో కుటుంబ సభ్యులు వెంటనే రిమ్స్ కు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ 2 గంటలకు ప్రాంతంలో మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు

# జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



**బెల్లంపల్లి , మార్చి 23( ప్రభాత సమాచారం)**
జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా వద్ద చలివేంద్రం చలివేంద్రం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ దేవయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రాంభించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి ని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అని జనహిత సేవా సమితి సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జనహిత సేవా సమితి చలివేంద్రం ఏర్పాటు తో ప్రారంభించబడి ఈ రోజుతో ఎనిమిదవ సంవత్సరం చలివేంద్రం ప్రారంభించడం జరిగిందని ఎండల తీవ్రత నుండి ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తున్న దాతలు మరియు జనహిత సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గెల్లీ రాజలింగు జనహిత సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే ప్రధాన లక్ష్యం..!

### గడీల్లో బందిగా మారిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
### పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
### ఖానాపూర్ లో విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం











**ఖానాపూర్ మార్చి 23(ప్రభాత సమాచారం)**
రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ఖానాపూర్ మండలంలోని జెకే ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశం కోసం కాంగ్రెస్ పార్టీ గాంధీ కుటుంబం అనేక త్యాగాలు చేసిందని, ఆ త్యాగాలను మరువకుండా ప్రజలంతా ఆ కుటుంబానికి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ అమలు చేసిందని గుర్తు చేశారు. ఓట్ల కోసం కులాల, మతాల పేరిట బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య విభేదాలను సృష్టిస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బిఆర్ఎస్ పార్టీపై పోరాటం చేసి నేడు ఆ దొరల కబంధ హస్తాల్లో బందీగా మారడం ఏంటని ప్రశ్నించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బిఆర్ఎస్ పాలనను స్వర్ణ యుగం అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం నుండి 50 వేల మెజారిటీ రావాలన్నారు. గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు..

**రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుంది**
**కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం**
**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**
రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. కడం ప్రాజెక్టు మరమత్తులకు 9 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం జరిగిందని తెలిపారు. ఖానాపూర్ ను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. డిగ్రీ కాలేజ్, గిరిజన యూనివర్సిటీ పోడు భూముల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, ఆ సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. మంత్రి సీతక్కను చూసి ఆదర్శంగా తీసుకొని స్ఫూర్తిదాయకంగా పనిచేస్తున్నామని అన్నారు. బూత్ లెవెల్ ను బలోపేతం చేయాలన్నారు. ఖానాపూర్ నియోజవర్గంలో త్వరలో గడపగడపకు తిరిగి సమస్యలను తెలుసుకుని ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని అన్నారు. రాథోడ్ రమేష్ లాంటి వ్యక్తులను ప్రజలు ఎవరు నమ్మే పరిస్థితుల్లో లేరని, కులాల, మతాల పేరిట వైశ్యామ్యాలను సృష్టించే ఇలాంటి వారిని ప్రజలెవరు నమ్మకూడదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యకర్తలకు నామినేట్ పదవులు ఇవ్వాలని కోరారు.

అనంతరం బిఆర్ఎస్,బిజెపి పార్టీల సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మంత్రి సీతక్క,ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి రావ్,టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, ఎంపీ టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు ఆత్రం భాస్కర్, ఆత్రం సుగుణ తో పాటు వివిధ జిల్లాల,మండలాల అధ్యక్షులు, బూత్ అధ్యక్షుడు మహిళ అధ్యక్షులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# సామాజిక సేవలకు గాను నాతరి స్వామికి సన్మానం



**బెల్లంపల్లి, మార్చి 23( ప్రభాత సమాచారం)** సామాజిక సేవలతో తన ప్రత్యేకతను చాటుకుంటున్న బెల్లంపల్లి పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి నాదర్ స్వామిని ఆయన స్వగృహంలో శనివారం రోజు ఎస్సార్ పూర్ పీపుల్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు చిలుముల రవితేజ,ఉపాధ్యక్షులు శనిగరపు రాజేష్ గారు, సెక్రటరీ రాసకొండ శ్రీకాంత్ లు ప్రత్యేకంగా కలిసి శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు ఆర్థిక సహాయంతో పాటు నిరుపేద కుటుంబాలకి విద్య వైద్య, సదుపాయాల కోసం ఆర్థిక సహాయం చేస్తున్న గొప్ప వ్యక్తి అని ఈ సందర్భంగా నాథరి స్వామి సేవలను కొనియాడారు.



# ప్రజలతోనే రఘునందన్..

### అఖిల భారత ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్..

హైదరాబాద్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం రఘునందన్ రావు ఎప్పటికప్పుడు పోరాడుతూ ప్రజల పక్షాన నిలుస్తున్నాడని అఖిల భారత ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ అన్నారు. ప్రజల పక్షాన గుంతెత్తి మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ మేరకు రఘునందన్ రావు జన్మదినం పురస్కరించుకొని పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




# మాస్కోలో ఉగ్రదాడి.. నెలక్రితమే హెచ్చరించిన అమెరికా

వాషింగ్టన్: రష్యా రాజధాని మాస్కోలో జరిగిన భీకర ఉగ్రదాడితో యావత్ ప్రపంచం ఉలిక్కిపడింది. క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాల్‌లోకి ముష్కరులు జరిపిన కాల్పుల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి పాల్పడింది తామేనంటూ ఇస్లామిక్ స్టేట్ ప్రకటించుకుంది. అయితే, ఈ ఘటనపై అగ్రరాజ్యం అమెరికా గతంలోనే రష్యాను హెచ్చరించడం గమనార్హం. మాస్కో ఘటనపై వైట్‌హౌస్ జాతీయ భద్రతా మండలి అధికార ప్రతినిధి అడ్రియెన్నీ వాట్సన్ మీడియాతో మాట్లాడారు. "మాస్కోలో ప్రణాళికాబద్ధమైన ఉగ్రదాడి జరిగే అవకాశముందని దాదాపు నెల రోజుల క్రితం అమెరికా ప్రభుత్వానికి నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. కాన్సర్ట్‌లు, ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రదేశాలను లక్ష్యంగా ఈ దాడులు జరగొచ్చని తెలిసింది. ఈ సమాచారాన్ని వాషింగ్టన్ వెంటనే రష్యా అధికారులతో పంచుకుంది. సామూహిక హత్యలు, కిడ్నాప్‌ల వంటి ముప్పుల గురించి నిఘా వర్గాల నుంచి సమాచారం అందిన వెంటనే అమెరికా ఆ దేశాలను అలర్ట్ చేస్తుంది. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఈ పాలసీని బైడెన్ సర్కారు విధిగా పాటిస్తోంది" అని వాట్సన్ వెల్లడించారు.

**రష్యాకు అండగా ఉంటాం: మోదీ –** ఈ ఉగ్రదాడి ఘటనను భారత ప్రధాని నరేంద్రమోదీ తీవ్రంగా ఖండించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రష్యా ప్రజలకు భారత ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. బాధిత కుటుంబాలు త్వరగా ఈ బాధ నుంచి బయటపడాలని, క్షతగాత్రులు కోలుకోవాలని ఆకాంక్షించారు. శుక్రవారం రాత్రి మాస్కోలోని అతిపెద్ద కాన్సర్ట్ హాల్‌లో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సాయుధ ముష్కరులు హాల్‌లోకి ప్రవేశించి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు.

ఈ దాడిలో 60 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 145 మందికి పైగా గాయపడ్డారు. పోలీసులు అక్కడకు చేరుకునే లోపే వారు పారిపోయారు. దుండగుల్లో ఒకరిని పట్టుకున్నట్లు సమాచారం. గత రెండు దశాబ్దాల్లో రష్యాలో ఇదే అతిపెద్ద ఉగ్రదాడి ఇది.




# మరో మూడు రోజులు ఈడీ కస్టడీలోనే

దిల్లీ: వారం రోజుల కస్టడీ ముగియడంతో ఎమ్మెల్సీ కవితను రౌజ్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టులో ఈడీ హాజరుపరిచింది. ఆమెను మరో 5 రోజుల కస్టడీకి ఇవ్వాలని దర్యాప్తు అధికారులు కోర్టును కోరారు. కేసు దర్యాప్తు పురోగతిని ఈడీ న్యాయవాది కోర్టుకు వివరించారు. మరికొందరితో కలిపి ఆమెను ప్రశ్నించాల్సి ఉందని పేర్కొన్నారు. కవిత కుటుంబసభ్యుల వ్యాపార లావాదేవీలపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. కవితకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని.. వైద్యులు సూచించిన ఆహారాన్నే ఇస్తున్నామని వెల్లడించారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు కవిత కస్టడీని మరో మూడు రోజులు పొడిగిస్తూ తీర్పు వెలువరించింది. ఈ నెల 26 వరకు ఆమె ఈడీ కస్టడీలో ఉండనున్నారు. కోర్టులోకి వెళ్లే ముందు ఆమె మీడియాతో మాట్లాడారు. తన అరెస్టు అక్రమమని.. న్యాయపోరాటం చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు సీబీఐ కోర్టులో బెయిల్ పిటిషన్‌ను కవిత తరపు న్యాయవాది దాఖలు చేశారు. వెంటనే ఈడీకి నోటీసులు ఇవ్వాలని కోరారు.

# సికింద్రాబాద్ భారాస ఎంపీ అభ్యర్థిగా పద్మారావుగౌడ్



హైదరాబాద్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి భారాస అభ్యర్థిని ఖరారు చేసింది. సిటింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పద్మారావు గౌడ్‌ను అభ్యర్థిగా ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. 1991 వరకు కార్పొరేటర్‌గా పనిచేసిన పద్మారావుగౌడ్ కాంగ్రెస్ నుంచి 2001లో తెరాసలో చేరారు. పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా పనిచేస్తూ 2002లో కారు గుర్తుపై కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. 2004లో సికింద్రాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో పద్మారావుగౌడ్ సనత్‌నగర్ నియోజకవర్గంలో పోటీచేసి.. కాంగ్రెస్ నేత మర్రి శశిధర్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. తెలంగాణ ఏర్పడ్డాక 2014 ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొంది.. ఎక్సైజ్ శాఖ, క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2018 ఎన్నికల్లో గెలిచి ఉపసభాపతి అయ్యారు. 2023లో సికింద్రాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

# ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు.. వారి ఇళ్లల్లో సోదాలు..

మాజీ డీఎస్‌పీ ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసుకు వ్యవహారంలో మాజీ పోలీసు అధికారుల ఇళ్లలో సోదాలు చేస్తున్నారు అధికారులు. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు పలువురు ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఇంటెలిజెన్స్ మాజీ ఎస్పీ భుజంగరావు, ఎస్ఐబి డీఎస్పీ తిరుపతన్న ఇళ్లలో సోదాలు చేపట్టారు అధికారులు. హైదరాబాద్ సిటీ మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధా కిషన్ రావు ఇంట్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. పంజాగుట్ట పోలీసులు ఏకకాలంలో 10 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రణీత్ రావు ఇచ్చిన కన్ఫెషన్ స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ సోదాలు నిర్వహిస్తున్నారు పోలీసులు. ఓ న్యూస్ చానల్ ఎండీ శ్రవణ్ రావు ఇంట్లో కూడా పోలీసులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే, శ్రవణ్ రావు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో ఫోన్ ట్యాపింగ్ కేసులో మరికొన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.



# కాంగ్రెస్ కంటోన్మెంట్ అభ్యర్థి ప్రకటనకు ముహూర్తం ఫిక్స్!

హైదరాబాద్, మార్చి 24: బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే ల్యాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. మే 13న కంటోన్మెంట్ ఉపఎన్నిక జరుగనుంది. ఎన్నికలకు సర్వం సిద్ధమవుతున్న తరుణంలో ఆయా పార్టీలు కంటోన్మెంట్‌లో పోటీ చేయబోయే అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి. ఇటు అధికార కాంగ్రెస్ పార్టీ కూడా ఈసారి కంటోన్మెంట్ ఉప ఎన్నికలో విజయం సాధించాలని ఉద్దేశంతోనే ముందుకు సాగుతోంది. కంటోన్మెంట్‌లో పోటీ చేయబోయే అభ్యర్థి ఎంపికపై దృష్టి పెట్టి కాంగ్రెస్.. అందుకు అభ్యర్థి ప్రకటనపై ముహూర్తం కూడా నిర్ణయించింది. ఈనెల 27వ తేదీన కంటోన్మెంట్ అభ్యర్థిని హస్తం పార్టీ ప్రకటించనుంది. అలాగే శ్రీ గణేష్‌ను తమ అభ్యర్థిగా కాంగ్రెస్ అనౌన్స్ చేయనుంది. కంటోన్మెంట్ కోసం కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు నాలుగు సార్లు సర్వేలు చేయగా.. కంటోన్మెంట్‌లో అరవ మాల సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉన్నట్లు గుర్తించారు.

శ్రీ గణేష్ అరవ మాల సామాజికవర్గం కావడంతో హస్తం నేతలు అతడి వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే లేనందున కంటోన్మెంట్ ఉపఎన్నికను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

**పోటీకి రెడీ అంటున్న లాస్య నివేదిత :** మరోవైపు కంటోన్మెంట్ అభ్యర్థి ఎవరనే విషయంపై బీఆర్ఎస్‌లో ఇంకా క్లారిటీ రాని పరిస్థితి. అయితే లాస్య నందిత సోదరి నివేదిత తాను కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తానని ఇటీవలే ప్రకటించారు. కార్యకర్తలు, ప్రజలు కోరిక మేరకే తాను ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి తన నిర్ణయాన్ని చెబుతానని అన్నారు. బీఆర్ఎస్ అధిష్ఠానం పోటీకి అంగీకరిస్తే... పార్టీకి అతీతంగా తనకు మద్దతు ఇవ్వాలని కూడా నివేదిత కోరారు. ఈ క్రమంలో కాంగ్రెస్ కూడా కంటోన్మెట్ ఉప ఎన్నికకు సై అనడంతో.. బీఆర్ఎస్ అధినేత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.




# కవిత బంధువుల ఇళ్లల్లో సోదాలు అందుకేనా..?

దేశ వ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ దర్యాప్తు వేగవంతం చేసింది. ఈ కేసును కొలిక్కి తీసుకురావడానికి ఈడీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టులు జరిగాయని హస్తిన వర్గాలు చెబుతున్న మాట.

ఇక అసలు విషయానికొస్తే.. కవిత ఈడీ కస్టడీలో ఉండగానే మరోసారి బిగ్ షాక్ తగిలింది. కవిత బంధువుల ఇళ్లల్లో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. శనివారం ఉదయం 6:30 గంటలకే హైదరాబాద్‌కు వచ్చిన ఈడీ అధికారులు కవిత ఆడపడుచు అఖిల నివాసంలో తనిఖీలు చేస్తున్నారు. మొత్తం ఏడుగురు ఈడీ అధికారుల బృందం ఈ సోదాలు చేస్తోంది. కవిత అరెస్ట్ అనంతరం ఇలా సోదాలు జరుగుతుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో ఇంత సడన్‌గా సోదాలు ఎందుకు..? కవితను ఇప్పట్లో ఈడీ వదలదా అంటూ గల్లీ నుంచి ఢిల్లీ వరకూ పెద్ద చర్చే జరుగుతోంది.

**సోదాలు వెనుక..?** విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఆరు రోజులపాటు ఈడీ కస్టడీలో ఉన్న కవిత నుంచి కీలక సమాచారం రాబట్టినట్లుగా తెలుస్తోంది. ఈ సమాచారంతోనే మరోసారి ఈడీ రంగంలోకి దిగిందని సమాచారం. ఉదయం నుంచి జరిగిన సోదాల్లో కీలక పత్రాలు, సమాచారం రాబట్టినట్లు తెలియవచ్చింది. ఇందుకు సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన అయితే రాలేదు. మరోవైపు.. కవిత, ఆమె భర్త అనిల్ కుమార్ బ్యాంకు లావాదేవీలను నిశితంగా పరిశీలించగా.. ఆడపడుచు అఖిల విషయం బయటికొచ్చిందని అందుకే ఈ సోదాలనే టాక్ కూడా గట్టిగానే నడుస్తోంది. వాస్తవానికి.. కవిత తర్వాత ఇదే కేసులో మరిన్ని అరెస్టులు, మళ్లీ సోదాలు జరిగే అవకాశం ఉందని వారం రోజులుగా వార్తలు గుప్పుమంటూనే ఉన్నాయి. సీన్ కట్ చేస్తే.. ఆ వార్తలన్నీ తాజాగా జరుగుతున్న సోదాలతో అక్షరాలా నిజమవుతున్నాయి. ఈ సోదాల తర్వాత ఏం జరుగుతుంది..? తనిఖీల్లో ఏం దొరుకుతాయి..? అనే విషయాలు తెలియాలంటే మరికొన్ని గంటలు వేచి చూడక తప్పదు.

# ఎంపీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో ఓటింగ్ శాతం పెరగాలి



హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మే 13వ తేదీన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఓటింగ్ సమయంలో హైదరాబాద్ నగరంలో ఏ ఎన్నిక వచ్చిన 40శాతం మించి పోలింగ్ జరగడం లేదని చెప్పారు. శనివారం నాడు బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఈ సారి ఎంపీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో ఓటింగ్ శాతం పెరగాలని కోరారు. సౌకర్యాలు లేవని ప్రతీ ఒక్కరూ విమర్శిస్తారని.. కానీ ఓటు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. విమర్శించడానికి ఎంత హక్కు ఉందో ఓటు వేసే బాధ్యత కూడా అంతే ఉందని గుర్తించాలని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ కుటుంబ సభ్యులతో చర్చించి అభివృద్ధి చేసే నేతలకు ఓటువేయాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాకిస్తాన్ వాళ్లకు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారిందని విమర్శించారు. గత తొమ్మిదిన్నరేళ్లుగా పాకిస్తాన్‌కి సంబంధించిన ఐఎస్ఐ ఉగ్రవాదులు దేశంలో చొరబడకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ చర్యలు తీసుకున్నారని వివరించారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధాన్ని ఆపి.. ఆ దేశంలో చిక్కుకున్న 25 వేల మంది భారతీయులను స్వదేశానికి మోదీ తీసుకొచ్చారని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో దేశం ఎలా ఉంది.. మోదీ హయాంలో దేశం ఎలా ఉందో తేడా చూసి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయాలని కిషన్ రెడ్డి కోరారు.

# రేవంత్.. నీ స్థాయిని నువ్వే తగ్గించుకోకు!

హైదరాబాద్, మార్చి 23: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఓ వైపు.. అసంతృప్తి వ్యక్తం చేస్తూనే.. మరోవైపు సలహాలు, సూచనలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకూ జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ మరీ మీడియా ముందుకొచ్చారు వీహెచ్. ఇంతకీ రేవంత్ గురించి వీహెచ్ ఏమన్నారు..? పదే పదే ఈ ఇద్దరి మధ్య పొరపచ్చాలు వస్తున్నాయనే విషయాలు ఇప్పుడు చూద్దాం.

**ఇంతకీ ఏం జరిగింది..? :** రాష్ట్రంలో బీఆర్ఎస్ పీడ పోయిందని ఒకప్పుడున్న సీఎం రేవంత్.. ఇప్పుడు ఏం మాట్లాడటంలేదని వీహెచ్ అన్నారు. ఈ విషయంపై రేవంత్‌ను కలిసి చెబుతామంటే తనకు టైమ్ ఇవ్వడం లేదని అన్నారు. తక్కువ సమయంలో సీఎం అయింది రేవంత్ రెడ్డి ఒక్కడే అని చెప్పుకొచ్చారు. పార్టీని బలోపేతం చేసి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారని.. కానీ ఇప్పుడు పరిస్థితులు చూసి కార్యకర్తలు బాధపడుతున్నారని వీహెచ్ ఒకింత అసంతృప్తి వెలిబుచ్చారు. బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారన్న విషయాన్ని మరోసారి గుర్తుచేశారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన కాంగ్రెస్ క్యాడర్‌కు న్యాయం చేయకుండా.. కార్యకర్తలపై కేసులు పెట్టినవాళ్లకు ఇప్పుడు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా డబ్బు సంపాదించి ఇప్పుడు అధికారంలో ఉన్నామని కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లో పనిచేసిన చాలా మంది నేతలు బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో కారెక్కి.. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేతలను దృష్టిలో పెట్టుకుని వీహెచ్ ఇలాంటి వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టంగా అర్థం అవుతోంది.



# ఆరోగ్య పరిస్థితిపై కోర్టులో కవిత పిటిషన్.. ఇంతకీ ఏమైంది?

న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం ఈడీ విచారణను ఎదుర్కుంటున్నారు. అయితే విచారణ సమయంలో కవిత తీవ్రమైన రక్తపోటును ఎదుర్కుంటున్నారు. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితికి సంబంధించి పీఎంఎల్ఏ కోర్టులో కవిత పిటిషన్ దాఖలు చేశారు. మందులు వాడుతున్నప్పటికీ రక్తపోటు నియంత్రణలోకి రావడం లేదని, ఈడీ అధికారులు వైద్య పరీక్షలు నివేదికలు అందించడం లేదని పిటిషన్‌లో తెలిపారు. వైద్య పరీక్షలు నివేదికలిచ్చేలా ఈడీకి ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానంలో కవిత పిటిషన్ దాఖలు చేశారు. మెడికల్ రికార్డ్స్ రిపోర్ట్స్ అందించాలంటూ ఎమ్మెల్సీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి ఈనెల 15 నుంచి కవిత ఈడీ కస్టడీలో ఉన్నారు. కస్టడీలో తనకు నిర్వహించిన మెడికల్ రిపోర్ట్స్ అందించాలని పిటిషన్‌లో కోరారు. అరెస్ట్ అయిన 15వ తేదీ నుంచి హైపర్ టెన్షన్‌తో కవిత ఇబ్బంది పడుతున్నారు. 15న న్యాయమూర్తి ముందు హాజరుపరిచిన సమయంలోనే హైపర్ టెన్షన్ విషయాన్ని తన న్యాయవాదికి కవిత చెప్పారు. ఆ విషయాన్ని కవిత తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో కవిత తరపు న్యాయవాదులకు మెడికో లీగల్ రిపోర్ట్ అందించాలని ఈడీని న్యాయమూర్తి ఆదేశించారు. అయితే కోర్టు ఆదేశించిన తర్వాత కూడా కేవలం 15 ,16వ తేదీల మెడికల్ రిపోర్ట్ మాత్రమే అందించారని కవిత పిటిషన్‌లో వెల్లడించారు. తన తరపు న్యాయవాదులు కోరినప్పటికీ కస్టడీలోకి తీసుకున్నప్పటి నుంచి మెడికో లీగల్ రిపోర్ట్‌లు అందించలేదని తెలిపారు. 15, 16వ తేదీల్లో అందించిన మెడికల్ రిపోర్ట్స్‌లో రక్తపోటు 186/103 గా ఉందని, రక్తపోటు నియంత్రణ కోసం చిన్నపాటి ఇంజక్షన్ ఇచ్చినప్పటికి రక్తపోటు 146/96 గా ఉందని ఎమ్మెల్సీ పిటిషన్‌లో పేర్కొన్నారు. హైపర్ టెన్షన్ తగ్గించేందుకు మెడిటేషన్ చేస్తున్నప్పటికీ తగిన ఫలితాలు కనిపించడం లేదని తెలిపారు. కస్టడీలో హైపర్ టెన్షన్ నియంత్రణలోకి రావడం లేదని.. 15వ తేదీ నుంచి అన్ని వైద్య పరీక్ష నివేదికను అందించాలని కవిత తన పిటిషన్ కోరారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660